క్లుప్తంగా

భీమవరంలో శాంతిర్యాలీ



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని శృతి వనం నుంచి ప్రకాశంచౌక్ వరకు ప్రపంచశాంతి వర్ధిల్లాలి, జాతీయ సమైక్యత వర్ధిల్లాలి, పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ ప్లకార్డులు, శాంతి జెండాలతో ర్యాలీ నిర్వహించారు. భీమవరం మండల శాఖ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమూరి బాబు, కోశాధికారి సన్నిధి నాగభూషణరావు, మంతెన రామ్ కుమార్‌వర్మ, వడ్డి వెంకటేశ్వరావు, ఇందుకూరి ప్రసాదరాజు, ఆదిత్య కృష్ణంరాజు, కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు ప్రమాదకరం



ఉండిలో నిర్వహిస్తున్న సీపీఐ ప్రచార జాతలో మాట్లాడుతున్న భీమారావు

ఉండి : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లనే దేశంలో ప్రమాదకరమైన పరిస్థితులు తలెత్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఈ నెల 22వ తేదీన చలో తణుకు బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ నిర్వహించిన ప్రచార జాత గురువారం ఉండికి చేరింది. ఈ సందర్భంగా ఉండి సెంటర్‌లో భీమారావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విధానాల వల్ల అన్ని రకాల ధరలు పెరిగిపోవడంతో ప్రజాజీవనం దుర్భరంగా మారిందన్నారు. మతతత్వ విధానాల వల్ల దేశంలో మణిపూర్ వంటి హింసాకాండలు పెచ్చుమీరుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా బాబులకు దారాదత్తం చేయడం వల్ల దేశానికి తీవ్రంగా హాని తలపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, సనపల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు సేవలు ప్రశంసనీయం



భీమవరంలో ఎస్పీ రవిప్రకాష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: గంజాయి, హెల్మెట్ వంటి వివిధ రకాల కేసులపై ఉక్కుపాదం మోపి యువతను మంచి మార్గంలో నడిపించడానికి ఎస్పీ యు.రవిప్రకాష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో రవిప్రకాష్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. దళితులపై ఎక్కడ దాడులు జరిగినా తక్షణం కేసులు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు, పిట్టా వినోద్ కుమార్, చిగురుపాటి రాజేష్, జొన్నల వజ్రం, నన్నేటి కిరణ్, గొర్ల గోపి , దాసరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

పాలకొల్లు అర్బన్: 'ప్రజానాడి' పేరుతో సామాజిక మాధ్యమంలో వైఎస్సార్ సీపీ నాయకులపై దుష్ప్రచారం చేస్తూ పోస్టు పెట్టిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం పాలకొల్లు పట్టణ సీఐ డి.రాంబాబును ఆ పార్టీ శ్రేణులు కోరారు. బుధవారం జరిగిన వైఎస్సార్ సీపీ పట్టణ కార్యకర్తల సమావేశంలో అధ్యక్షుడు చందక సత్తిబాబును పార్టీ కార్యకర్తలు దుర్భాషలాడినట్లు, సమావేశానికి హాజరైన చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీలు కోపంతో సమావేశం నుంచి వెళ్లిపోయినట్లు, అలాగే నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి సందిగ్ధంలో పడినట్లు ప్రజానాడిలో అసత్యాలతో కూడిన విషయాలను సామాజిక మాధ్యమంలో ప్రచారం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐకి ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, పార్టీ నాయకులు కావలి శ్రీనివాసరావు, రావి నాగేశ్వరరావు, చినిమిల్లి గణపతిరావు, శీలం సూరిబాబు, ఉప్పె పండుబాబు, కెల్లా దుర్గారావు, శంకరావు శ్రీను, యలకల రంగా, ఇజ్జాడ చినబాబు, కొరగంజల శ్రీనివాసరావు, కేశవరపు సత్యనారాయణ, గుండుబోయిన నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



స్వాతంత్య్ర దినోత్సవ ముగింపు వేడుకలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక బీవీరాజు పార్కు వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం కార్యక్రమానికి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ప్రజలచే దేశభక్తిపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ దేశభక్తిని చాటుకునేందుకు ఆజాదికా అమృతో మహోత్సవ్ ఎంతో ఉపయోగపడిందన్నారు. ఎందరో త్యాగధనుల వల్ల భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిందని, అందుకే వీరుల చరిత్రలను యువత ఆదర్శంగా తీసుకుని సమసమాజానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, ఈఈ త్రినాథరావు, చెరుకువాడ రంగసాయి, కట్రెడ్డి సీతారామయ్య, కోమటి రాంబాబు, నామన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్య్ర ముగింపు వేడుకలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్వాతంత్య్ర ముగింపు వేడుకలు శ్రీ విజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్విట్ ఇండియా స్తూపం వద్ద పూలమాలలు వేసి అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా సర్వోదయమండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ నాటి క్విట్ ఇండియా ఉద్యమం దేశవ్యాప్తంగా స్వాతంత్య్ర స్ఫూర్తిని నింపిందని, భీమవరంలో 77వ అంతర్ దినోత్సవాలు 14 రోజులపాటు నిర్వహించామని చెప్పారు. శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 1942లో ఆగస్టు 8న బొంబాయిలో మహాత్మాగాంధీ పెట్టిన ఉద్యమానికి శంఖారావం పూరించారని, అదే స్ఫూర్తితో ఆగస్టు 17న భీమవరం పట్టణంలో భూపతిరాజు సుబ్బ తాతరాజు, దంతులూరి నారాయణరాజు, అడవి బాపిరాజు, గొట్టుముక్కల రామచంద్రరాజు నాయకత్వంలో తాలూకా ఆఫీస్ ప్రాంగణంలో మహోన్నత ఉద్యమం జరిగిందని గుర్తుచేశారు. ఇందులో బ్రిటిష్ వారి దమననీతికి గొట్టుముక్కల బలరామరాజు, వేగేశ్న నారాయణరాజు, ఉద్దరాజు వెంకటరాజు, ముంత బ్రహ్మం అసువులు బాసరని వివరించారు. క్విట్ ఇండియా పునర్నిర్మాణ కమిటీ నాయకులు కంతేటి వెంకటరాజు, బోండా వెంకట సుబ్బారావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 1992లో క్విట్ ఇండియా స్వర్ణోత్సవాలు స్వాతంత్య్రం సమరయోధులు కలిదిండి విజయ నరసింహరాజు, గొట్టుముక్కల రామచంద్రరాజు నాయకత్వంలో చెరుకువాడ సోదరులు వెంకటరామయ్య, రంగసాయిల పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించి ఇక్కడ స్తూపం నిర్మించారని, 2022లో క్విట్ ఇండియా స్తూపాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించినట్టు చెప్పారు. మానవత భీమవరం శాఖ అధ్యక్షులు బి.వెంకటపతి రాజు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నాయకులు ఎం సీతారామ ప్రసాద్, కంతేటి వెంకటరాజు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ ఎస్‌కే చాంద్ బాషా తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

ఉండి : అక్క చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూత సంక్షేమ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ అప్పారావు కోరారు. ప్రస్తుతం 2023 సంవత్సరానికిగాను దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ పథకానికి 45 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు అర్హులు అని తెలిపారు. ఈనెల 28వ తేదీలోగా అర్హులైన మహిళలు వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,750 నగదును నేరుగా బ్యాంక్ ఖాతాలో జమచేస్తుందని వివరించారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం 10వ వార్డులో ఇటీవల అనారోగ్యానికి గురైన రాజోలు రాజేష్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్కు మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఈ చెక్కును లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు ప్రసాదరాజు అందజేశారు. రాజేష్ కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం



ఏలూరుపాడు వంతెన వద్ద వెంకయ్య వయ్యేరు కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

కాళ్ల : అధికారుల నిర్లక్ష్యం రైతులు పాలిట శాపంగా మారింది. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలోని వెంకయ్య వయ్యేరు పంట కాలువ గుర్రపుడెక్క, చెత్త చెదారంతో నిండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 10 గ్రామాలకు ప్రధాన నీటి వనరు ఈపంటకాలువ. కాలువలో గుర్రపుడెక్క, తూడు, వ్యర్థపదార్థాలు మేట వేసి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. దీనివల్ల ఏలూరుపాడు గ్రామంలోని 2వ నెంబర్ ఛానల్ కాలువ పూర్తిగా కలుషితమై తాగు, సాగునీరు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు గురవుతున్నారని నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు అంకాల పాండురంగారావు ఆరోపించారు. అలాగే ఈ కాలువను ఆనుకుని సుమారు 500 ఎకరాలు ఆయకట్టులో వరి సాగు అవుతుందని, ఎద్దడి సమయంలో కాలవ ద్వారా నీరు అందక, వర్షాకాలంలో నీరు లాగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇరిగేషన్ ఏఈ, డీఈ, ఎస్‌ఈలకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వెంకయ్య వెయ్యేరులో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకుని నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని పాండురంగారావు కోరారు.

ఉపాధి పనులు భేష్



ఉపాధి పనుల ఆడిట్‌ను నిర్వహిస్తున్న డ్వామా పీడీ రాజేశ్వరరావు

ఆకివీడు : మండలంలో గత ఏడాది ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగాయని డ్వామా పీడీ రాజేశ్వరరావు చెప్పారు. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 382 పనులకు గానూ రూ. 3.17 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు రూ.1.10 కోట్లు వెచ్చించారని చెప్పారు. ఆయా గ్రామ ఆడిట్‌లు, మండల ఆడిట్‌లను పరిశీలించగా ఉపాధి పనులు సక్రమంగా జరిగి, ఉపాధి కూలీలకు కూలి ధర సక్రమంగా చెల్లించినట్లు తేలిందని డ్వామా పీడీ చెప్పారు. పనులు సక్రమంగా నిర్వహించిన మేట్‌లను ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కొన్ని గ్రామాల్లో చిన్న చిన్న లోపాలుండటంతో ఉపాధి పనుల్లో రూ. 3,169, పంచాయతీరాజ్‌లో రూ.18,898 ఆయా మేట్ల నుంచి రికవరీకి ఆదేశాలిచ్చినట్లు రాజేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, డ్వామా విజిలెన్స్ అధికారిణి ఏవీ విజయలక్ష్మి, డ్వామా ఏపీడీ వీ విజయలక్ష్మి, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ పున్నం నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్, రామరవితేజ వర్మ, జీఆర్‌పీ.సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సైదాల సూర్యనారాయణ, సర్పంచ్‌లు చిట్టిబాబు, ఎన్.రామరాజు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితాలో పొరపాట్లు ఉండకూడదు



అధికారులతో సమావేశమైన డీపీఓ మల్లికార్జునరావు

ఉండి : ఓటరు తుది జాబితా తయారీలో పొరపాట్లకు తావుటీకుండా అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా పంచాయతీ అధికారి కే మల్లికార్జునరావు బూత్ లెవెల్ అధికారులకు తెలిపారు. గురువారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని బీఎల్ఓ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఓటరు జాబితా తయారు చేసే అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏ విధమైన నిర్లక్ష్యం వహించినా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అర్హత ఉండే ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. మండలంలో ఇప్పటికే 83 శాతం ఓటరు జాబితా తయారీ కార్యక్రమాన్ని పూర్తి చేశామని, మిగిలిన 17 శాతం ఈ నెల 21లోగా పూర్తి చేస్తామని డీపీఓ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎల్‌పీఓ కే కొండలరావు, ఎంపీడీవో ఏవీ అప్పారావు, ఏఎస్ఓ పీ రామారావు, బీఎల్ఓలు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అధిక పిలకలతోనే దిగుబడి సాధ్యం



పొలంబడిలో వరి పిలకల దశను పరిశీలిస్తున్న దృశ్యం

ఆకివీడు : వరి మొక్క నాటిన పిదప మొక్కకు అధిక పిలకలు వేసే విధంగా రైతులు కృషి చేయాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య సూచించారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు పొలంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు సూచనలిస్తూ నాట్లు వేసే ముందు మొక్కకూ మొక్కకూ మధ్య 4.6 అంగుళాల ఖాళీ ఉండాలన్నారు. మొక్క పెరుగుతున్న సమయంలో చీడ పీడలు దరికి చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరుతడులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. తడిపొడి విధానంలో వరి సాగు ఉంటే పిలకలు అధికంగా వేస్తుందన్నారు. దబ్బులను మిత్ర, శత్రుపురుగులు ఆశిస్తాయన్నారు. మిత్ర పురుగుల్ని కాపాడుకుంటూ, శత్రుపురుగుల్ని నాశనం చేసే విధంగా చూడాలన్నారు. యాజమాన్య పద్ధతులతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని సీతారామయ్య వివరించారు. మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ. ప్రియాంక మాట్లాడుతూ కుప్పనపూడి గ్రామంలోని పంట భూముల్లో చౌడు శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు చల్లారావు పొలంలో ఎంటీయూ 1121 వంగడం సాగు చేసినట్లు చెప్పారు. సాగులో విత్తన వినియోగం, ఎరువుల వాడకం, పురుగుమందుల వాడకం, పిలకల దశ తదితర అంశాలపై రైతులకు వివరించారు. చౌడు భూముల్లో నీటి సాంద్రత, వినియోగించాల్సిన మందులపై సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



రాయలంలోని ఓ చేలో ఈ క్రాప్ చేస్తున్న అధికారులు

భీమవరం అర్బన్: రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాసు సూచించారు. భీమవరం మండలం రాయలం గ్రామంలో బుధవారం ఈ క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ శ్రీనివాస్ మాట్లాడుతూ వరినాట్లు వేసిన తరువాత ఆ పొలంలో సర్వే నెంబర్ ఆధారంగా ఏయే పంట రకం, ఎప్పుడు వేశాం తదితర అంశాలపై పంట పొలాలు వద్ద వీఏఈలతో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలో ఏడువేల ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టగా 900 ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేయించుకున్నట్టు చెప్పారు. ఈ క్రాప్ నమోదైతేనే సున్నా వడ్డీ, రైతు భరోసా, పంటల బీమా, పండించిన ధాన్యానికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర తదితర లబ్ధి చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో వీఆర్ఓ, వీఏఈ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థినులకు వాలీబాల్ కిట్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

ఆకివీడు: గ్రామీణ విద్యార్థినులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచించారు. స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు గురువారం ఆయన ఏఎంసీ మాజీ డైరెక్టర్ పుప్పాల గంగాధర్ (చిన్న) ఆర్థిక సాయంతో వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థినులు క్రీడాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి పాఠశాలలో క్రీడల అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని పీవీఎల్ పిలుపునిచ్చారు. క్రీడాకారుల్లో ప్రతిభను పెంపొందించేందుకు ప్రభుత్వం ఆడుదాం అందరం కార్యక్రమాన్ని అమలుచేస్తోందని చెప్పారు. ప్రతి సచివాలయ పరిధిలో విద్యార్థులు, విద్యార్థేతరులు ఆడుదాం కార్యక్రమంలో పాల్గొనేందుకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్ పుప్పాల పండు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, పడాల శ్రీనివారెడ్డి, నిమ్మల నాగు, అంబటి రమేష్, ఎండీ జహంగీర్, షేక్ హుస్సేన్, యర్రా కేశవ, కురెళ్ల పొలు, వాడపల్లి మోహన్,తిప్పా దుర్గా భవాని, ప్రధానోపాధ్యాయురాలు ఇందిర పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించం



పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనాథ్

పాలకోడేరు : ఎన్నికల సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేస్తామని భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ హెచ్చరించారు. గొల్లలకోడేరులో ఆరో వార్డుకు ఎన్నికలు నిర్వహించనున్న ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రం, లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులు వివిధ రాజకీయ నాయకులు, గ్రామస్తులతో పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎటువంటి గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని సూచించారు. మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని అన్నారు. ఎన్నికల ప్రచారం ముగియగానే బయట వ్యక్తులు గ్రామంలో ఉండరాదని తెలిపారు. ఎన్నికల అధికారి శివకృష్ణ, సీఐ నాగమురళీ, ఎస్సై నాళం శ్రీనివాసరావు, కార్యదర్శి రామలీల తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

ఆకివీడు : ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు, అడ్రస్‌ల మార్పు, పేరుల్లో లోపాలు వంటివాటిని వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నమోదు ప్రక్రియ ఈ నెల 21వ తేదీతో ముగియనుందన్నారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు తమ పరిధిలోని ఓటర్ల వివరాల్ని ఆన్‌లైన్ చేయాలన్నారు. తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ జీ.కృష్ణమోహన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత సూచనలు పాటించాలి

వీరవాసరం: రహదారి ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. వీరవాసరం మండలం రాయకుదురులో గురువారం చట్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ సుబ్బరాజు రహదారిపై ప్రయాణం చేస్తున్నప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పోలీసులకు, ప్రజలకు మధ్య ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్టు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు నడుచుకోవాన్నారు. కార్యక్రమంలో ఎస్సై పి.రమేష్, గెద్దం భాస్కరరావు, సర్వేశ్వరరావు, పీవీ రామకృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, తాడాల దుర్గా ప్రసాద్, తోట పెద్దిరాజు, వెలిదిండి దయానంద్, చల్లబోయిన రామలింగేశ్వరరావు, సింహాద్రి సాయి రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లికి వారాల పండుగ



వారాల పండుగలో పాల్గొన్న పీవీఎల్, వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి : పెదపుల్లేరులో వేంచేసియున్న సత్తెమ్మ అమ్మవారికి వారాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి 500 బిందెలతో క్షీరాభిషేకం చేశారు. శ్రావణ మాసం మొదటి గురువారం నాడు అమ్మవారికి ఈ పండగను నిర్వహిస్తుంటారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదపుల్లేరు ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వారాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. తొలుత పీవీఎల్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాయి రావులమ్మ, నిర్వాహకులు గేదెల నర్సింహులు, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గుల్ల అప్పన్న, కలిదిండి సీతారామరాజు, యడ్ల సత్యనారాయణ, కరణం వెంకటేశ్వరరావు, నానేపల్లి శ్రీను, పాటూరి దొరబాబు తదితరులు పండుగ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దళిత క్రైస్తవులను ఎస్సీల జాబితాలో చేర్చాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: దళిత క్రైస్తవులను ఎస్సీల జాబితాలో చేర్చాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ కోరారు. గురువారం భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సుందరకుమార్ మాట్లాడుతూ క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించి పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ధర్నాలో పాలపర్తి జోనా, ఏలేటి సునీల్‌కుమార్, మరపట్ల మునియ్య, గొల్ల రాజ్‌కుమార్, ఉండ్రు విల్సన్, ఆలమూరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 28వ వార్డుకు చెందిన గంధం వెంకట సురేష్ కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి మానవత సభ్యుడు కోలాటి రవీంద్రనాథ్ బెనర్జీ దంపతులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత కార్యదర్శి పీఎస్ ప్రతాప్‌రాజు, మాజీ అధ్యక్షుడు గుడాల హరిబాబు, బొక్కా గంగాధర్, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్ పాల్గొన్నారు.